ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును పరామర్శించిన నేతలు

దుండిగల్, మే 3: ఇటీవల తిరుపతిలో ప్రమాదవశాత్తు కాలుకు గాయం కావడంతో చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శంభీపూర్ రాజును కూకట్‌పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు, మాజీ ఎమ్మెల్సీ కర్నే ప్రభాకర్ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా గాయానికి గురైన తీరు, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

కేపీహెచ్‌బీ కాలనీ డివిజన్ శ్రీలా పార్క్ ఫ్లైడ్‌లోని శ్రీమదలర్మేల్ మంగ, పద్మావతి సమేత శ్రీలక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయ త్రయోదశ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. శనివారం ఉదయం సుప్రభాత సేవ, విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, నిత్య హోమం, పుష్ప యాగం, పవళింపు సేవ తదితర పూజలు జరిగాయి. ఈ బ్రహ్మోత్సవాల్లో భాగస్తులైన భక్తులందరికీ ఆలయ కమిటీ చైర్మన్ కుర్మయ్యగారి కొండలరావు కృతజ్ఞతలు తెలిపారు. – కేపీహెచ్‌బీ కాలనీ, మే 3

టెన్నిస్ టోర్నమెంట్లో సత్తా చాటిన వెంకటనారాయణమూర్తి

పథకాలతో వెంకటనారాయణమూర్తి

కేపీహెచ్‌బీ కాలనీ, మే 3:థాయిలాండ్ దేశంలోని పట్టాయనగరంలో నిర్వహించిన గ్రేటర్ స్పోర్ట్స్ క్లబ్ మాస్టర్ 2025 ఎంటీ 400 టెన్నిస్ టోర్నమెంట్‌లో కేపీహెచ్బీ కాలనీ చెందిన కొత్వాల వెంకటనారాయణ మూర్తి మూడు పథకాలను సాధించి సత్తా చాటాడు. పురుషుల డబుల్స్ 55 ప్లస్ విభాగంతో వెంకటనారాయణమూర్తి (తెలంగాణ), రాజ్‌దత్(హర్యానా) కలిసి పురుషుల డబుల్స్ 55 ప్లస్ విభాగంలో టైటిల్ విజేతలుగా నిలిచారు. అలాగే సింగిల్స్ 55 ప్లస్ విభాగంలో రన్నరప్‌గా, డబుల్స్ 45 ప్లస్ విభాగంలో భాగస్వామ్యతో కలిసి రన్నరప్‌గా నిలిచాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిష్టాత్మకమైన టెన్నిస్ టోర్నమెంట్లో రాణించి మూడు పథకాలను సాధించడం గర్వంగా ఉందని, భవిష్యత్తులో మరిన్ని పథకాలు సాధించి తెలంగాణకు పేరు ప్రఖ్యాతలు తీసుకొస్తారని తెలిపారు.

టికెట్ తీసుకోమంటే బస్ కండక్టర్‌పై దాడి

శేరిలింగంపల్లి, మే 3:టికెట్ తీసుకోమని అడిగినందుకు ఆర్టీసీ బస్ కండక్టర్‌పై దాడికి పాల్పడిన సంఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. బర్కత్‌పూర డిపోకు చెందిన రూట్ నంబర్-216 ఆర్టీసీ సిటీ బస్సు లింగంపల్లి నుంచి కోఠికి వెళ్తుంది. లింగంపల్లి నుంచి మెహిదీపట్నం. వైపు వెళ్తుండగా.. శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో గచ్చిబౌలి జంక్షన్లో ముందు నుంచి. నలుగురు వ్యక్తులు, వెనుక నుంచి ఓ మహిళ బస్సు ఎక్కారు. టికెట్ తీసుకోవాలని కండక్టర్ మాణిక్యం సదరు ప్రయాణికులను అడుగగా.. వెనుక ఉన్న వారు తీసుకుంటారని చెప్పారు. వెనుక ఉన్న మహిళను అడగగా ముందు ఉన్న వారు తీసుకుంటారని చెప్పింది. మొత్తానికి ఎవరు తీసుకోకపోవడంతో టికెట్ తప్పనిసరి అని కండక్టర్ చెప్పడంతో సదరు యువకులు ఆయనపై దాడి పాల్పడ్డారు. విచక్షణా రహితంగా కోడుతుండటంతో ప్రయాణికులు స్పందించి దాడికి పాల్పడిన వారిని పట్టుకొని రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. అనంతరం కండక్టర్ మాణిక్యం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

కుత్బుల్లాపూర్, మే 3: జీవితంపై విరక్తి చెందిన యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఏపీ శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన భీంపల్లి వంశీకృష్ణ(26)గత కొన్నేళ్ల కిందట నగరానికి వలస వచ్చి అంగడిపేటలో ఉంటూ ఎల్లక్ట్రిషన్ వర్క్ చేసుకుని జీవనం వెల్లదీస్తున్నాడు. కాగా, గతేడాది కిందట పోక్సో కేసులో జైలుకెళ్లి వచ్చాడు. అప్పటి నుంచి జీవితంపై విరక్తి చెంది శనివారం ఇంట్లో ఉరేసుకొని మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి సేవిస్తున్న ఐదుగురి అరెస్ట్

దుండిగల్, మే 3: బహిరంగ ప్రదేశంలో గంజాయి సేవిస్తున్న ఐదుగురిని సూరారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. కుత్బుల్లాపూర్ సర్కిల్, సుభాష్‌నగర్ డివిజన్ పరిధి, సూరారం కాలనీ సాయిబాబానగర్‌లోని బహిరంగ ప్రదేశంలో కొందరు వ్యక్తులు గంజాయి సేవిస్తున్నట్లు శనివారం పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని పరిశీలించగా ఎండీ.ఇమామ్ అలియాస్ చోటు, ఎండీ అస్లం అలీ, ఎండీ సోహైల్, గట్టి దీపక్, దండబోయిన పవన్‌కుమార్ గంజాయి తాగుతూ పోలీసులకు పట్టుబడ్డారు. వారిని విచారించగా.. కర్ణాటకలోని బీదర్ రైల్వేస్టేషన్ దగ్గర గుర్తు తెలియని వ్యక్తుల దగ్గర గంజాయి కొనుగోలు చేసి గత కొన్నిరోజులుగా సేవిస్తున్నట్లు తెలిపారు. దీంతో పోలీసులు పైఐదుగురి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

నేడు సామూహిక ఉపనయనములు

మియాపూర్, మే3: కామాక్షి బ్రాహ్మణ సంఘం నిజాంపేట్ ఆధ్వర్యంలో హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని నిజాంపేట్ రోడ్ సెవెన్ హిల్స్ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం సామూహిక ఉపనయనములను నిర్వహించనున్నట్లు సంఘం ప్రతినిధులు శనివారం తెలిపారు. ఉదయం 7.14గంటలకు ఉపనయన ముహూర్తంలో పెద్ద సంఖ్యలో వటువులకు ఉపనయన సంస్కారము నిర్వహించనున్నట్లు తెలిపారు. హైదర్‌నగర్, నిజాంపేట్ పరిసర ప్రాంతాలకు చెందిన బ్రాహ్మణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

కాలనీల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయం

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

ఎమ్మెల్యే వివేకానంద్, కమిషనర్ సాబేర్ అలీకి వినతిపత్రం అందజేస్తున్న ఆయా కాలనీల ప్రజలు

దుండిగల్, మే 3: కాలనీల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నామని బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 11వ డివిజన్, కేటీఆర్ కాలనీ లోని పార్కులో మౌలిక వసతుల కల్పనపై శనివారం నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లలో గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి అభివృద్ధి పరచామని, రానున్న రోజుల్లో నిజాంపేట్ కార్పొరేషన్‌లోని అన్ని బస్తీల్లో వందశాతం అభివృద్ధి పనులు పూర్తిచేసి ఆదర్శవంతమైన నియోజకవర్గంగా కుత్బుల్లాపూర్‌ను చేస్తామన్నారు. అదేవిధంగా అన్ని కాలనీల మధ్య ఆహ్లాదకర వాతావరణాన్ని అందిస్తూ సమీప కాలనీవాసులు వ్యాయామం చేసుకునే విధంగా, పిల్లలకు ఆటవిడుపుగా అందరికీ ఉపయోగపడేలా ఈ పార్కును అభివృద్ధి పరుస్తామన్నారు. అనంతరం బాలాజీ హిల్స్, కేటీఆర్ కాలనీ, వినాయకనగర్, గాయత్రి గార్డెన్స్, తిరుమలనగర్, బాలాజీ మెడోస్, అఖిల అబౌట్ కాలనీ వాసులు, రాజీవ్ గాంధీ నగర్ బెరాకా పాస్టర్ అసోసియేషన్ సభ్యులు, ఆయా కాలనీలలో మిగిలి ఉన్న అభివృద్ధి పనులు, సమస్యలపై వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ, మేనేజర్ పవన్, మున్సిపల్ డీఈలు యూనిస్, వసంత, వాటర్ వర్క్స్ డీజీఎం చంద్రమోహన్, ఏఈ ప్రవీణ్, విద్యుత్ ఏఈ రాజు, నిజాంపేట్ మాజీ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్, మాజీ కార్పొరేటర్ రవికిరణ్, గాజుల సుజాత, రాఘవేంద్రరావు, రజిత రవికాంత్, కొలను మీనా సునీల్‌రెడ్డి, మాజీ కో-ఆప్షన్ సభ్యులు చంద్రగిరి జ్యోతి సతీశ్, పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్,సమీప కాలనీలవాసులు పాల్గొన్నారు.

–నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి మధురానగర్ నూతన వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ..ప్రజలకు, ప్రజాప్రతినిధులకు మధ్య సంక్షేమ సంఘాలు వారధిగా ఉండాలని, కాలనీ అభివృద్ధి దిశగా నూతన సంక్షేమ సంఘం పనిచేయాలన్నారు. కార్యక్రమంలో నూతన అధ్యక్షులు హేమంత్‌రావు, ఉపాధ్యక్షులు మద్దయ్య, శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి వెంకయ్య, సంయుక్త సెక్రటరీ, కోశాధికారి కోటి రెడ్డి, సంయుక్త కోశాధికారి నవీన్ కుమార్, సభ్యులు వెంకటశాస్త్రి, అప్పల కె.ఆర్, పేరు భాషా షేక్, బి.రాజేశం, పి. చైతన్య, భరత్‌కుమార్, జెవిపిస్, గోపీచంద్, సత్యబాల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికల అభివృద్ధికి కృషి

ఫతేనగర్ కార్పొరేటర్ సతీశ్ గౌడ్

శోభన కాలనీ శ్మశానవాటికలో అభివృద్ధి పనులను ప్రారంభించిన కార్పొరేటర్ సతీశ్‌గౌడ్

బాలానగర్, మే 3: శ్మశానవాటికల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీశ్ గౌడ్ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని శోభనా కాలనీ దర్గా సమీపంలోని శ్మశానవాటిక అభివృద్ధికి రూ.15లక్షలతో పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. కూకట్పల్లి ఎమ్మెల్యే సహకారంతో బస్తీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సలావుద్దీన్, వహీద్, షేక్ మతిన్, సయ్యద్ ఫయాజ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

రాజుకాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ రవీందర్ రెడ్డి

బాలానగర్, మే 3: బాలానగర్ డివిజన్ రాజు కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పిస్తానని స్థానిక కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి అన్నారు. శనివారం రాజు కాలనీకి చెందిన పలువురు మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలానగర్ డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో మెరుగైన సదుపాయాలు కల్పించడానికి పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. డివిజన్‌లో ఎక్కడైనా సరే సమస్య తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ ఆశ, నర్సింగ్‌రావు, సురేశ్‌కుమార్, పవన్, వెంకట్‌రాజ్, రాము, అశోక్‌కుమార్,సాయి, అరుణ్, అప్పారావు, సూర్య, శశి, అమీర్, ప్రసన్నకుమార్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షలకు విశేష స్పందన

మాదాపూర్, మే 3: ఉచిత కంటి పరీక్షకు విశేష స్పందన వచ్చింది. చందానగర్ హుడా కాలనీ లోని లయన్స్ క్లబ్, అనంద కంటి దవాఖాన ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి పరీక్షలను నిర్వహించారు. ఇందులో దాదాపు 200మందికి పైగా కంటి పరీక్షలు నిర్వహించగా.. కంటి సమస్యలు ఉన్నవారికి తగిన జాగ్రత్తలను తెలియచేశారు. ఇందులో భాగంగా అవసరం అయిన వారికి కంటి అద్దాలు అందజేయనున్నట్లు లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ కొండ విజయ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో వైద్య బృందంతో పాటు లయన్స్ క్లబ్ సభ్యులు లక్ష్మీ నారాయణ గౌడ్, ఆశోక్ గౌడ్, మధుసూదన్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, సింగ్ దాసరి రాజశేఖర్, మారం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్యప్రదర్శన

మాదాపూర్, మే 3: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో అన్నమాచార్య భావనా వాహిని సంస్థ వ్యవస్థాపకురాలు, పద్మశ్రీ పురస్కార గ్రహీత డా. శోభారాజు ఆధ్వర్యంలో శనివారం కూచిపూడి నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో తొలుత విష్ణు సహస్రనామ స్తోత్రము, శ్రీ లక్ష్మీఅష్టోత్తర శత నామ స్తోత్రం, అన్నమయ్య అష్టోత్తరం పారాయణ చేశారు. అన్నమాచార్య భావనా వాహిని శిష్యులు అన్నమయ్య గాయత్రి పాడి గురుస్తుతి చేసిన అనంతరం నాట్య ప్రేరణ స్కూల్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ తరపున ఎర్రోజు శరత్‌కుమార్ గణనాథాయ, దశావతారం తారంగం, ఉదయాద్రి వంటి సంకీర్తనలకు భక్తిశ్రద్ధలతో కూచిపూడి నృత్య ప్రదర్శన చేసి అలరించారు. కళాకారులకు అన్నమాచార్య భావనా వాహిని పక్షాన సంస్థ వ్యవస్థాపకులు డా. శోభారాజు జ్ఞాపికను అందించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

పవర్ లిఫ్టింగ్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి క్యాంప్ ఆఫీసులో సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, మే 3: అనారోగ్యంతో వైద్యశాలలో చేరిన పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం నియోజకవర్గంలోని మోతినగర్‌కు చెందిన సుదర్శన్ బాబు అనారోగ్యంతో బాధపడుతుండగా... కుటుంబ సభ్యులకు రూ. 3 లక్షల సీఎం రిలీఫ్ అండ్ చెక్కును అందజేశారు. కష్టకాలంలో ప్రభుత్వ ఆర్థిక సహాయం ఎంతగానో ఉపయోగపడుతుందని, పేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నేతలు ఉన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీలతో దేహదారుఢ్యం

బాలానగర్, మే 3: పవర్ లిఫ్టింగ్ సాధనతో దేహదారుఢ్యం లభించడం ఖాయమని కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం ఓల్డ్ బోయిన్పల్లి డివిజన్ పరిధిలోని భాగ్యశ్రీ గార్డెన్లో ఏర్పాటు చేసిన పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఆయనతోపాటు డివిజన్ కార్పొరేటర్ నరసింహ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. నేటి యువత సమయాన్ని వృధా చేయకుండా వ్యాయామం చేయడం ద్వారా దేహదారుఢ్యం పెంపొందించుకోవడం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో నాయకులు కర్ర జంగయ్య, ఇర్ఫాన్, మేకల హరినాథ్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సున్నంచెరువు సుందరీకరణ పనులు పరిశీలన

అల్లాపూర్, మే 3: సున్నం చెరువు లో హైడ్రా చేపట్టిన సుందరీకరుణ పనులను అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబియా బేగం శనివారం అధికారుల తో కలిసి పరిశీలించారు. పనుల పురోగతిపై కార్పొరేటర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. వర్షాకాలం ప్రారంభమయ్యేలోగా సుందరీ కరణ పనులు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో విరస్ నాయకులు లింగాల ఐలయ్య, సంజీవరెడ్డి, యోగి రాజా తదితరులు పాల్గొన్నారు.

సున్నం చెరువులో జరుగుతున్న సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం

బాచుపల్లిలో అనారోగ్యంతో బ్రెజిల్ మహిళ మృతి

దుండిగల్, మే 3: వివిధ రకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఓ విదేశీ మహిళ మరణించిన సంఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం..బ్రెజిల్‌కు చెందిన ఒలివెరాదోస్ సాంటోస్ లూసియా గ్లైడ్ అలియాస్ లూసియా గాడ్స్ చౌబే(57)కు ఒడిశాకు చెందిన సునీల్ చౌబే అనే వ్యక్తినీ వివాహం చేసుకుని భారత్‌కు వచ్చారు. మూడేళ్ల అనంతరం 2015లో విడిపోయారు. ఆ తరువాత ఆమె భారతదేశంలోనే నివసిస్తూ, సునీల్ చౌ బేపై న్యాయపోరాటం చేస్తూ పాస్టర్ ప్రభుదాస్ సహకారంతో నిజాంపేట్‌లోని గ్రీన్ అవెన్యూస్‌లోని విల్లా నెం.79లో నివసిస్తున్నారు. ఆమె డయాబెటిస్, కడుపు క్యాన్సర్, థైరాయిడ్ సమస్యలతోపాటు ఆస్తమాతో బాధపడుతుంది. మే 2న పాస్టర్ ప్రభుదాస్ ఆమెను పరామర్శించేందుకు వెళ్లగా, ఆమె ఆరోగ్య పరిస్థితి బాగలేనట్లు గుర్తించి ఆసుపత్రికి వెళ్లాలని సూచించగా, ఆమె తిరస్కరించారు. దీంతో సెక్యూరిటీ సిబ్బందికి ఆమెను గమనించమని చెప్పి వెళ్లిపోయారు. శనివారం పాస్టర్ ప్రభుదాస్ చర్చ్ సభ్యుడైన కిశోర్‌ను ఆమెను చూసేందుకు పంపారు. ఆమెను పరీక్షించి మృతి చెందినట్లు ధృవీకరించారు. పాస్టర్ ప్రభుదాస్ ఫిర్యాదు పోలీసులు కేసు నమోదు చేసి, మరణానికి కారణాలపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నారు.

శిల్పారామంలో అలరించిన నృత్యోత్సవాలు

కొండాపూర్, మే 3:వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనలో భాగంగా శనివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో ప్రారంభమైన సృజన జాతీయ నృత్యోత్సవాలు ప్రత్యేకంగా అలరించాయి. అంజనా చౌదరి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నృత్యోత్సవాలు రెండురోజులపాటు కొనసాగుతున్నట్లు తెలిపారు.

గాజుల రామారంలో ఉద్రిక్తంగా రెవెన్యూ కూల్చివేతలు

గాజుల రామారంలో ఉద్రిక్తంగా మారిన రెవెన్యూ కూల్చివేతలు

దుండిగల్, మే 3: కుత్బుల్లాపూర్ మండలం, గాజులరామారం రెవెన్యూ పరిధిలో మండల తహసిల్ అధికారులు శనివారం చేపట్టిన కూల్చివేతలు ఉద్రిక్తతకు దారితీశాయి. గాజులరామారం సర్వే నంబర్ 79/1, హెచ్ ఏ ఎల్ కాలనీ సమీపంలోనీ ప్రభుత్వ భూమిలో కొంతకాలంగా భక్తులు దేవాలయం నిర్మించి పూజలు చేస్తున్నారు. అయితే ఆలయంతోపాటు ప్రభుత్వ భూమిలో ఇండ్ల నిర్మాణాలు చేపట్టినట్టు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందడంతో శనివారం జెసిబి తో వెళ్లి కూల్చివేతలు చేపట్టారు. అయితే ఆలయం కోసం చేసి చేపట్టిన నిర్మాణాలను ఎలా కూల్చివేస్తారంటూ పలువురు భక్తులు అధికారులను అడ్డుకున్నారు. దీంతో రెవెన్యూ అధికారులు జగద్గిరిగుట్ట పోలీసుల సహాయంతో ఆలయం చుట్టూ వెలసిన నిర్మాణాలను నేలమట్టం చేశారు. కూల్చివేతల సమయంలో భక్తులు, ఆలయ నిర్వాహకులు జేసిబికి అడ్డుపడడంతో కొంత ఉతుకుత వాతావరణ నెలకొంది. పోలీసులు ఆందోళనకారులను శాంత పరచడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. కాగా కొందరు రాజకీయ నాయకులు ఆలయానికి సంబంధించిన గదులు, నిర్మాణాలకు సంబంధించిన శిలాఫలకాలపై తమ పేర్లు ఎందుకు పెట్టలేదంటూ తమను ఇబ్బంది పెడుతున్నారనీ ఆలయ నిర్వహకులు పేర్కొన్నారు. దానిని దృష్టిలో పెట్టుకొనే ఆలయం చుట్టూ నిర్మించిన గదులను కూల్చి వేయించారని వాపోయారు. ఇక్కడ ధార్మికత కంటే స్వార్థం ఎక్కువగా ఉందని ఆలయ నిర్వాహకులు పేర్కొనడం గమనార్హం.

నిర్లక్ష్యం.. పట్టపగలే ఐమాస్ట్ వెలుగులు

అల్లాపూర్, మే 3: వీధి దీపాల నిర్వహణ అధికారుల నిర్లక్ష్యంతో అస్తవ్యస్తంగా మారుతుంది. కొన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు వెలుగక రాత్రి వేళలో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, మరికొన్ని ప్రాంతాల్లో పొగలు రేయి తేడా లేకుండా నిరాడంకంగా వీధి దీపాలు వెలుగుతూ కనిపించాయి. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని పాలు కాలనీలో వీధి దీపాల నిర్వహణ అధికారులు గాలికి వదిలేశారు. తమ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదని గత కొన్ని నెలలుగా అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ వారు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వివేకానందనగర్ ప్రధాన కూడలి వద్ద మిట్టమధ్యాహ్నం ఐమాక్స్ లైట్లు వెలుగుతున్నాయి. చీకటి పడగానే వీధిదీపాలు వెలగడం, వెల్తురు రాగానే దీపాలు ఆఫ్ అయ్యేలాగా ఏర్పాటు చేసిన టైమర్లు పనిచేయకపోవడమే సమస్యకు ప్రధాన కారణమని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీధిదీపాల నిర్వహణపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

లైక్‌వ్యూ కాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ నార్ని శ్రీనివాసరావు

మియాపూర్, మే 3: కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి ఆదర్శంగా లేక్ వ్యూ కాలనీని తీర్చిదిద్దుతానని హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్ని శ్రీనివాసరావు పేర్కొన్నారు. కాలనీవాసుల భాగస్వామ్యంతో మౌలిక వసతులను కల్పిస్తామని స్పష్టం చేశారు. డివిజన్ పరిధిలోని లేక్‌వ్యూ కాలనీలో అధికారులు, కాలనీవాసులతో కలిసి శనివారం కార్పొరేటర్ పర్యటించారు. ఈ సందర్భంగా అంతర్గత రహదారులు, వీధిదీపాలు సహా పలు సమస్యలను కాలనీవాసులు కార్పొరేటర్‌కు విన్నవించారు. అనంతరం కార్పొరేటర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కాలనీలో దెబ్బతిన్న వీధిదీపాలను వెంటనే మార్చి పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.రహదారులు ,డ్రైనేజీ ,తాగునీరు, వరద కాలువల నిర్మాణంతో పూర్తిస్థాయి మౌలిక వసతులను కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మహదేవ,సుధాకర్, సంజీవ్ పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలి

జర్నలిస్ట్ కాలనీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ముక్కర్ల లాలయ్య

మేనేజర్ పవన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ లాలయ్య

దుండిగల్, మే 3: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, 30వ డివిజన్ పరిధి, జర్నలిస్టు కాలనీ ప్రధాన రహదారిపై వాహనాల రద్దీ పెరిగిన దృష్ట్యా రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని జర్నలిస్ట్ కాలనీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ముక్కర్ల లాలయ్య అన్నారు. శనివారం ఆయన మున్సిపల్ కార్పొరేషన్ మేనేజర్ పవన్‌కుమార్‌ను కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లాలయ్య మాట్లాడుతూ...నిజాంపేటలోని వాటర్ ట్యాంక్(మల్లన్న గుడి)నుంచి మియాపూర్-గండి మైసమ్మ ప్రధాన రహదారికి అనుసంధానంగా ఉన్న వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి కళాశాల వరకు ఉన్న రహదారిపై ఇటీవల కాలంలో విపరీతంగా వాహనాల రద్దీ ఏర్పడిందన్నారు. ఈ నేపథ్యంలో వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు రహదారిపై స్పీడ్ బ్రేకర్లను(నియంత్రి కలు) ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమస్యను పరిశీలించి, పరిష్కరించాలని మేనేజర్‌కు విజ్ఞప్తి చేయగా..ఆయన సానుకూలంగా స్పందించారని లాలయ్య తెలిపారు.

పార్కు స్థలంలో.. బ్యాడ్మింటన్ కోర్టు..

చందానగర్ హుడా